నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, శుక్రవారం 26 జూలై 2024 | YADADRI BHUVANAGIRI

నేడు కార్గిల్ విజయ్ దివస్ రజతోత్సవాలు

బీబీనగర్, జూలై 25 : కార్గిల్ యుద్ధంలో విజయం సాధించి 25ఏండ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం కార్గిల్ విజయ్ దివస్ రజతోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్షేత్ర ప్రచార అధికారి జి.కోటేశ్వర్ రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని రాఘవాపురం గ్రామ పరిధిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ సైనిక మహిళా డిగ్రీ కళాశాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దేశం కోసం యుద్ధంలో వీరోచితంగా పోరాడి తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన సైనిక అమర వీరుల త్యాగాలను స్మరించుకొనేందుకు ప్రతి ఏటా జులై 26న కార్గిల్ విజయ్ దివస్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులకు గురువారం కళాశాలలో వ్యాస రచన, పెయింటింగ్ పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

బడ్జెట్‌లో మొండి'చెయ్యి'

జిల్లా ప్రజల ఆశలపై కాంగ్రెస్ సర్కారు నీళ్లు

యాదగిరిగుట్ట నర్సన్న ముచ్చటే ఎత్తలే..
ఐటీ హబ్ ఊసే లేదు

మెడికల్ కళాశాలకు నిధులు సున్నా
పరిగణలోకి తీసుకోని బస్వాపూర్ ప్రాజెక్ట్
గంధమల్ల రిజర్వాయర్‌ను పట్టించుకోలే..
కొత్త సంక్షేమ పథకాల ప్రస్తావన లేదు..
రాష్ట్ర బడ్జెట్‌పై జిల్లా ప్రజల పెదవి విరుపు

రాష్ట్ర బడ్జెట్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాకు మొండిచెయ్యి చూపింది. కొత్త సర్కారులో కొత్త ప్రాజెక్టులు, నిధుల ఆశలు గల్లంతయ్యాయి. పాత వాటికి కూడా నిధులు కేటాయించని పరిస్థితి. బడ్జెట్‌లో యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయం ముచ్చటే ఎత్తలేదు. బస్వాపూర్ ప్రాజెక్ట్, గంధమల్ల రిజర్వాయర్లకు నిధుల ఊసులేదు. వంతెనలు, రోడ్లను పరిగణలోకి తీసుకోలేదు. ఎన్నికల ముందు చెప్పినట్లు కొత్త సంక్షేమ పథకాలను ప్రస్తావించకపోవడంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు.

– యాదాద్రి భువనగిరి, జూలై 25 (నమస్తే తెలంగాణ)



కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారి పూర్తి స్థాయి బడ్జెట్‌ను అసెంబ్లీలో పెట్టింది. డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క బిల్లును ప్రవేశపెట్టారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు జిల్లాకు అనేక హామీలు ఇచ్చింది. అధికారంలోకి రాగానే హామీలన్నీ నెరవేరుస్తామని వాగ్దానాలు చేసింది. తొలిసారి పూర్తి బడ్జెట్ కావడంతో జిల్లా ప్రజలు ఏమేం వస్తాయో అని భారీ ఆశలు పెట్టుకున్నారు. కానీ ఆశలు అడియాసలుగానే మిగిలిపోయాయి. ఇక ఆరు గ్యారెంటీల్లో భాగంగా మహాలక్ష్మి పథకం కింద ఆడబిడ్డలకు రూ. 2,500, విద్యా భరోసా, ఆసరా పింఛన్ల పెంపు, నిరుద్యోగ భృతి, ఆటో కార్మికులు, దళిత బంధు తదితర అనేక పథకాల ప్రస్తావనే తీసుకురాలేదు.

యాదగిరిగుట్ట ప్రస్తావన లేదు

తెలంగాణలో పెద్ద పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న యాదగిరిగుట్ట గురించి బడ్జెట్‌లో కనీసం ప్రస్తావించలేదు. గతంలో మాజీ సీఎం కేసీఆర్ నేతృత్వంలో రూ. 1,200 కోట్లతో గుట్టను ఎంతగానో అభివృద్ధి చేశారు. ఇప్పటికీ కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయి. భక్తులకు మరిన్ని పాత కలెక్టరేట్ భవనంలో మెడికల్ కాలేజీ ప్రారంభానికి ఏర్పాట్లు చేస్తున్నారు. అందుకు అనుగుణంగా మరమ్మతులు కూడా చే యించారు. కళాశాల ఏర్పాటుకు నిధులు అవసరం. కళాశాల నిర్మాణం, సదుపాయాలకు మాత్రం ఎలాంటి బడ్జెట్‌ను కేటాయించలేదు.

ఐటీ హబ్ ఏమాయే..?

ఎన్నికల ముందు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పలు హామీలు ఇచ్చారు. ఇందులో ఐటీ హబ్ ప్రధానమైంది. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని, ఇందుకోసం ఐటీ హబ్‌ను తీసుకొస్తామని ఎన్నికల ప్రచారాస్త్రంగా మార్చుకున్నారు. కానీ బడ్జెట్‌లో మాత్రం ఐటీ జోలికే పోలేదు. ఎన్నికల్లో లబ్ధి కోసమే కుంభం ఐటీ హబ్ ప్రస్తావన తెచ్చారని, ఇప్పుడు మాత్రం పట్టించుకోవడంలేదని నిరుద్యోగులు మండిపడుతున్నారు.

మెడికల్ కాలేజీకి నిధులేవీ..?

గత బీఆర్ఎస్ సర్కారు యాదగిరిగుట్టకు మెడికల్ కాలేజీని మంజూరు చేసింది. కళాశాల నిర్మాణానికి రూ. 183 కోట్లు కేటాయిస్తూ పరిపాలనా అనుమతులు ఇచ్చింది. సదుపాయాలు కల్పించాల్సి ఉంది. ఇది నిరంతర ప్రక్రియ. వీటి కోసం నిధులు అవసరం. వివిధ పనుల కోసం రూ. 100 కోట్ల దాకా కావాలి. ప్రభుత్వం మాత్రం యాదగిరిగుట్టను పరిగణలోకి తీసుకోలేదు.

బస్వాపూర్‌ను మరిచారు

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బస్వాపూర్ (నృసింహసాగర్) ప్రాజెక్ట్‌ను తీసుకొచ్చారు. భువనగిరి మండలంలోని బస్వాపూర్ వద్ద 11.39 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మాణం చేపట్టారు. ఇప్పటికే 90శాతం పనులు కూడా పూర్తయ్యాయి. ముంపు గ్రామాల ప్రజలు నష్ట పరిహారం, పునరావాసం కోసం ఎదురుచూస్తున్నారు. అన్ని రకాల పనులు కలిపి సుమారు రూ.500 కోట్లు అవసరం ఉంది. కానీ ప్రభుత్వం మాత్రం బస్వాపూర్ ప్రాజెక్ట్‌కు నిధుల కేటాయింపు మరిచింది.

ట్రిపుల్ ఆర్, మూసీకి గంపగుత్తా నిధులు..

బడ్జెట్‌లో ట్రిపుల్ ఆర్ ప్రాజెక్ట్‌కు రూ. 1,525, మూసీ నది ప్రక్షాళనకు రూ.1500 కోట్ల చొప్పున నిధులు కేటాయించారు. జిల్లాలో బీబీనగర్, పోచంపల్లి, వలిగొండ, రామన్నపేట మీదుగా మూసీ నది ప్రవహిస్తున్నది. మూసీ నది ప్రక్షాళన డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. కేటాయించిన నిధులు జిల్లా పరిధిలోని మూసీ పరిసర ప్రాంతాలకు ఎప్పుడు వస్తాయో వేచి చూడాలి. ఇక ట్రిపుల్ ఆర్‌లో భాగంగా ఉత్తర, దక్షిణ భాగాలకు కలిపి నిధులు ఇచ్చారు.

సాగు నీటి ప్రాజెక్టులను పట్టించుకోలే..

తుర్కపల్లి మండలంలో ఉన్న గంధమల్ల రిజర్వాయర్ పనులకు సంబంధించి గతంలోనే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య హామీ ఇచ్చారు. గంధమల్ల రిజర్వాయర్ పనులు నేటికీ ప్రారంభం కాలేదు. బడ్జెట్‌లో దీన్ని పరిగణలోకి తీసుకోలేదు. ఇక వృథాగా పోతున్న మూసీ జలాలను సద్వినియోగం చేసుకుని ఆయకట్టును మరింత స్థిరీకరించేందుకు భువనగిరి నియోజకవర్గంలోని ధర్మారెడ్డి, పిలాయిపల్లి, బునాదిగాని కాల్వల ఆధునికీకరణ ఊసే లేదు. జనగామ జిల్లాలోని తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి రాజాపేట, తుర్కపల్లి, బొమ్మలరామారం మండలాలకు దేవాదుల కాల్వ ద్వారా ఆలేరు, గుండాల మండలాలకు సాగు నీరందించే కాల్వలకు నిధులు కేటాయించలేదు.

ఒట్టి మాటల బడ్జెట్

భట్టి పెట్టిందంతా ఒట్టిమాటల బడ్జెట్. అసలు సంక్షేమ పథకాలు కొనసాగాలంటే ఈ బడ్జెట్ సరిపోతుందా. అన్ని రంగాలతోపాటు రైతాంగాన్ని మరోమారు మోసం చేసింద్రు. దళితబంధు ప్రస్తావన లేకుండా, యాదవులు, మత్స్యకారులు, గౌడన్నలు ఇలా కులవృత్తుల సంక్షేమాన్ని హరించేలా ఈ బడ్జెట్ ఉన్నది. కనీసం పేదలకు ఉపయోగపడే ఒక్క పాలసీ అయినా ప్రవేశపెట్టారా. ఒక్కటైనా కొత్త సంక్షేమ పథకం లేకుండా అన్ని రంగాల ప్రజలను మోసం చేశారు. ఈ ప్రభుత్వానికి తెలంగాణ ప్రజల సంక్షేమం, అభివృద్ధి పట్ల ఏ మాత్రమూ అవగాహన లేదనే విషయం ఈ బడ్జెట్‌తో స్పష్టమైంది. డంబాచారం, హంగు ఆర్భాటం తప్ప పసలేని బడ్జెట్‌తో కాంగ్రెస్ తన అసలు రంగు బయటపడింది.

–బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎంపీ, బీఆర్ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు

కాంగ్రెస్‌ది రైతు వ్యతిరేక ప్రభుత్వం..

ఎన్నికల ముందు కాంగ్రెస్ నాయకులు రైతులకు అర చేతిలో స్వర్గం చూపించారు. ఇప్పుడు మాత్రం రైతులకు నిధుల కేటాయింపులో మాత్రం అలసత్వం వహిస్తున్నారు. రైతు భరోసా ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నారు. రైతులు, కౌలు రైతులు, కూలీలను పట్టించుకోవడం లేదు. ఇది రైతు వ్యతిరేక ప్రభుత్వం. సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కూడా సమకూర్చుకోలేని అసమర్థులు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు. సన్న వడ్లకు మాత్రమే రూ. 500 బోనస్ ఇస్తామంటున్నరు. ఉమ్మడి జిల్లాలో 11 మండలాల్లో పూర్తిగా దొడ్డు వడ్లు పండిస్తారు. అన్ని పంటలకూ బోనస్ ఇవ్వాలి.

– కొలుపుల అమరేందర్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, రైతు బంధు సమితి మాజీ చైర్మన్

పెండింగ్ స్కాలర్‌షిప్‌లకు నిధులేవి?

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం జరిగింది. అరకొర నిధులతో విద్యారంగం ఎట్లా అభివృద్ధి జరుగుతుంది. యూనివర్సిటీల అభివృద్ధి రాష్ట్ర వ్యాప్తంగా రూ.500 కోట్లు మాత్రమే కేటాయించడం దారుణం. తమ మేనిఫెస్టో ప్రకారం బాసర ఐఐఐటీ మాదిరిగా మరో రెండు కేటాయిస్తామని చెప్పినా వాటి గురించి ప్రస్థావించలేదు. గురుకులాల నిర్మాణం కోసం కనీస నిధులు లేవు. రూ.7 వేల కోట్లకు పైగా పెండింగ్ స్కాలర్ షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉన్నాయి, వాటి విడుదలకు నిధులు కేటాయించలేదు. స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని ప్రకటన చేసినా స్పష్టమైన నిధులు కేటాయించలేదు.

– జక్కినగేశ్, బీఆర్ఎస్‌వీ జిల్లా ప్రధాన కార్యదర్శి, బీబీనగర్

మహిళలకు రూ.2,500 సాయం మాటేలేదు

అధికారంలోకి వస్తే 18 ఏండ్లు నిండిన పేద మహిళలకు నెలకు 2,500 రూపాయలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ప్రస్తుత బడ్జెట్‌లో ఆ మాటెత్తలేదు. ఉచిత బస్సు ప్రయాణానికి 723 కోట్ల రూపాయలు కేటాయించగా రూ.2,500 ఇచ్చే దానిని పట్టించుకోలేదు. హామీల అమలులో కాంగ్రెస్ విఫలమైంది. ఎంతో మంది మహిళలు ఈ పథకం వస్తుందని ఆశగా ఎదురు చూస్తుండగా ఈ బడ్జెట్‌తో నిరాశే మిగిలింది.

– గుత్తికొండ ప్రమీలావెంకటమణారెడ్డి, కల్మల్‌చెర్వు, గరిడేపల్లి మండలం

విద్య, వైద్య రంగాన్ని విస్మరించిన ప్రభుత్వం

2లక్షల91వేల 159 కోట్ల రాష్ట్ర బడ్జెట్లో విద్యా రంగానికి రూ.21,292 కోట్లు 7.3 శాతం మాత్రమే కేటాయించారు. వైద్యారోగ్య రంగానికి రూ.11,468 కోట్లు అంటే 3.9 శాతం కేటాయించారు. విద్యారంగానికి 15 శాతం కేటాయింపులు ఆశించగా అరకొర నిధులతో నాణ్యమైన విద్య, జీవన ప్రమాణ పెరుగుదల, ప్రభుత్వ బడులను బలోపేతం ఎలా సాధ్యమవుతుంది. రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, వరికి బోనస్, మహిళలకు నెలకు రూ.2,500, ఆరోగ్యశ్రీ కేటాయింపులు జరుగలేదు. విధానాలు నిర్ణయించి కేటాయింపులు చేస్తామని ఆర్థిక మంత్రి బట్టి విక్రమార్క చెప్పడం సబబుగా లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా న్యూ ఇన్నోవేటివ్ పథకాలు ప్రకటిస్తుందని ఆశించగా బడ్జెట్ రూపకల్పన అలా జరుగలేదు. ఉద్యోగుల పెండింగ్ బిల్లుల సమస్యల పరిష్కారానికి కేటాయింపులు ప్రకటించలేదు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ అమలు ప్రస్తావనకు సంబంధించి ప్రతిపాదనలు చేయకపోవడం పట్ల ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

–బడుగుల సైదులు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, కోదాడ

విద్యారంగం ప్రాధాన్యతను విస్మరించారు

విద్యారంగానికి బడ్జెట్‌లో కేవలం 7.31శాతం నిధులు కేటాయించడం సరైంది కాదు. కొంతకాలంగా మేధావులు, విద్యావేత్తలు, ఉపాధ్యాయ సంఘాలు రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 20శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తున్న మొండిచేయి చూపించారు. ఈ బడ్జెట్‌తో పేద విద్యార్థులందరికీ నాణ్యమైన విద్య అందించడం సాధ్యం కాదు. ఇది పేదలు, బలహీన వర్గాలను ఉద్దేశపూర్వకంగా అన్యాయం చేసినట్లే.

– ఎం.సోమయ్య, డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

వెనుకబడిన ప్రాంతాలను పట్టించుకోలేదు

రాష్ట్ర బడ్జెట్‌లో సైతం వెనుకబడిన ప్రాంతాలను విస్మరించినట్లు ఉన్నది. ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారెంటీల అమలుపై ఉన్న చిత్తశుద్ధి మిగిలిన సమ్యలపై లేదు. రైతు భరోసా, రైతు బీమా ఎప్పటి వరకు ఏ రకంగా అమలు చేస్తారో నిర్దిష్టంగా పేర్కొనలేదు. పెండింగ్‌లో ఉన్న శ్రీశైలం సొరంగం మార్గం పూర్తి చేయడానికి తగిన నిధులు, మూసీ ప్రాజెక్టు ఆధునీకరణ, పర్యాటక రంగం అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాంచలేదు. డిండి ఎత్తిపోతల పథకానికి డీపీఆర్ ఆమోదంపై ఎలాంటి ప్రకటన చేయకపోవడం బాధాకరం. నియోజకవర్గానికి 3,500 గృహ నిర్మాణాలు చేపడితే ఇండ్లులేని నిరుపేదలకు ఎప్పటి వరకు పూర్తి అవుతాయి. ఆరోగ్యశ్రీని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో చేర్చి పేదలకు సత్వర వైద్యం అందేలా చూడాలి. ప్రజల సంక్షేమానికి తగ్గట్టుగా నిధులు ఖర్చు చేయాలి. లేనిచో ప్రజలను సమీకరించి నిర్మాణాత్మక పోరాటాలు చేస్తాం.

– ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, సీపీఎం నల్లగొండ జిల్లా కార్యదర్శి

దివ్యాంగులను కాంగ్రెస్ మోసం చేసింది

కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులను నమ్మించి మోసం చేసింది. ఎన్నికల మ్యానిఫెస్టోలో దివ్యాంగుల పెన్షన్‌ను రూ. 4,116 నుంచి రూ.6,116 చేస్తామని ప్రకటించడంతో ఆశతో కాంగ్రెస్‌కు ఓటేశారు. అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా పెన్షన్‌ను పెంచలేదు. ప్రస్తుతం బడ్జెట్‌లో పెన్షన్ పెంపునకు ఎలాంటి నిధులు కేటాయించకపోవడంతో దివ్యాంగులకు తీవ్ర నిరాశతో ఉన్నారు.

–షేక్ నయీమ్, బీఆర్‌వీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, సూర్యాపేట

రైతు కూలీలకు సాయంపై స్పష్టతేది?

బడ్జెట్‌లో ప్రజా పంపిణీ, ఇండ్ల నిర్మాణం, విద్య, వైద్యానికి ప్రాధాన్యత ఇవ్వలేదు. వ్యవసాయ కార్మికులకు ఏడాదికి రూ.12వేలు ఇస్తామని ప్రకటించగా దాన్ని ఎప్పటి నుంచి అమలు చేస్తారో స్పష్టంగా చెప్పలేదు. కోట్లాదిమందికి ఉపాధి కలిగించే ఉపాధి హామీకి బడ్జెట్‌లో నిధులు పెంచలేదు. వృద్ధులు, వితంతవులు, దివ్యాంగులు, ఇతర సామాజిక వర్గాల పెన్షన్ పెంపు ప్రస్తావన లేక పోవడం దురదృష్టకరం. మహాలక్షి పథకానికి కేటాయింపులు లేకపోవడం మహిళలను మోసం చేయడమే.

–మట్టిపల్లి సైదులు, వ్యవసాయ కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం

- ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి
- తొలిసారి పార్లమెంట్‌లో ప్రసంగం

యాదాద్రి భువనగిరి, జూలై 25 (నమస్తే తెలంగాణ) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ తమ అస్తిత్వాన్ని కాపాడుకునే విధంగా ఉన్నదని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా గురువారం బడ్జెట్‌పై ఆయన ప్రసంగించారు. మొదటిసారి ఎంపీగా గెలిచిన ఆయన తొలిసారి ప్రసంగించారు. దేశంలో ఆంధ్రప్రదేశ్, బిహార్ రాష్ట్రాలు మాత్రమే ఉన్నాయా అని ప్రశ్నించారు. అన్ని రాష్ట్రాలకు సమానమే చేయాలని, కానీ కొన్నింటికి నిధులు ఇవ్వడాన్ని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీపై విశ్వాసంతో 8 సీట్లు ఇచ్చారని, కానీ బడ్జెట్‌లో తెలంగాణకు నిధులు తేవడంలో విఫలమయ్యారని విమర్శించారు. బడ్జెట్‌లో తెలంగాణకు పూర్తిగా అన్యాయం చేశారని మండిపడ్డారు. రాష్ట్ర పునర్విభజన చట్టంలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కు అధిక నిధులు కేటాయించి, అదే చట్టంలో ఉన్న తెలంగాణకు ఎందుకు మొండి చెయ్యి చూపించారని ప్రశ్నించారు. పాలమూరు–రంగారెడ్డి నీటి పారుదల పథకానికి జాతీయ ప్రాజెక్టు హోదా, నిధులు ఇవ్వాలని తెలంగాణ డిమాండ్ చేస్తున్నప్పటికీ బడ్జెట్లో ఆర్థిక మంత్రి ఎలాంటి హామీ ఇవ్వలేదన్నారు. మూసీ ప్రక్షాళన, ఖాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, కరీంనగర్ స్మార్ట్ సిటీస్, ఐఐఎంఎం, ఐటీఐఆర్‌తో పలు ప్రాజెక్టులపై పీఎం, కేంద్ర మంత్రులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలిసి ప్రతిపాదనలు అందజేసినా పరిగణలోకి తీసుకోలేదని తెలిపారు. రాష్ట్రంలో పదేండ్ల తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, మహిళలకు ఉచిత రవాణా, 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్, రూ.500 గ్యాస్ సిలిండర్, రూ. 31 వేల కోట్ల రైతులకు రుణమాఫీ చేసిందని చెప్పారు.

పార్లమెంట్‌లో మాట్లాడుతున్న చామల

వదలని ముసురు

- ఐదురోజులుగా కురుస్తున్న వాన
- ఇండ్లకే పరిమితమవుతున్న జనం

భువనగిరి కలెక్టరేట్, జూలై 25 : జిల్లాలో ఐదు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న ముసురుతో జనం ఇబ్బంది పడుతున్నారు. రోజంతా చిరుజల్లులు కురుస్తుండడంతో బయటికి వెళ్లి పనులు చేసుకోలేకపోతున్నారు. రోడ్లు చిత్తడిగా మారి ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. వర్షంతో ప్రజలు ఇండ్లకే పరిమితమవుతున్నారు. జిల్లాలో గురువారం వలిగొండలో 13.5 మిల్లీమీటర్లు, ఆత్మకూరు(ఎం)లో 9, రామన్నపేటలో 6.5, భూదాన్‌పోచంపల్లిలో 5.8, బీబీనగర్‌లో 4.9, తుర్కపల్లి(ఎం), చౌటుప్పల్, మోత్కూరులో 4.7, ఆలేరులో 4.5, మోటకొండూరులో 4, యాదగిరిగుట్టలో 3.3, రాజాపేట, బొమ్మలరామారంలో 3.1, భువనగిరిలో 2.5, అడ్డగూడూరులో 2.4, సంస్థాన్‌నారాయణపురంలో 2, గుండాలలో 1.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

యాదగిరిగుట్ట కొండపైన వర్షంలో భక్తుల పాట్లు

యాదగిరిగుట్టలో..

సర్వేల్ గురుకుల వసతి గృహాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే

విద్యార్థులు ఇష్టంగా చదివి ఉన్నత లక్ష్యాన్ని చేరుకోవాలి

- సర్వేల్ గురుకుల పాఠశాలను సందర్శించిన కలెక్టర్ హనుమంతు కె.జెండగే
- త్వరలో పాఠశాల నూతన భవనాలు ప్రారంభిస్తాం..
- దాదాపు నాలుగు గంటలు గురుకులంలో గడిపిన కలెక్టర్

సంస్థాన్ నారాయణపురం, జూలై 25 : విద్యార్థులు ఇష్టంగా చదివి ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే సూచించారు. మండలంలోని సర్వేల్ గురుకులం, అమ్మ ఆదర్శ పాఠశాలలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురుకుల పాఠశాలలో విద్యార్థుల హాజరు, కిచెన్ రూమ్, డైనింగ్ హాల్, స్టోర్ రూమ్‌లోని సరుకులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. 8, 9, 10వ తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. పలు సబ్జెక్టులపై ప్రశ్నలను అడిగారు. పిల్లలు ఇంగ్లిష్‌లో వెనుకబడినట్లు గుర్తించి స్పెషల్ క్లాసులు చెప్పాలని ప్రధానోపాధ్యాయుడికి తెలిపారు. విద్యార్థులు స్పోర్ట్స్ కిట్స్ లేవని చెప్పడంతో త్వరలో కావాల్సిన క్రీడా సామగ్రి అందిస్తానని చెప్పారు. గురుకుల విద్యార్థులు ఆటలు, చదువుల్లో రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని చెప్పారు. సర్వేల్ గురుకుల పాఠశాల నూతన భవనాల్లో చిన్న చిన్న పనులు మిగిలిపోయాయని, త్వరలోనే నూతన భవనాలను ప్రారంభిస్తామని కలెక్టర్ తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు. దాదాపు నాలుగు గంటలు గురుకుల పాఠశాల విద్యార్థులతో కలెక్టర్ గడిపారు. అనంతరం జిల్లా పరిషత్, అంగన్‌వాడీ పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మిగిలిపోయిన పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట తాసీల్దార్ కృష్ణ, ఎంపీడీఓ ప్రమోద్ కూమార్, ఎంపీఓ యాదయ్య, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, ప్రధానోపాధ్యాయుడు వెంకయ్య పాల్గొన్నారు.

యాదగిరిగుట్టలో ప్రారంభానికి సిద్ధమైన కోర్టు భవనం

యాదగిరిగుట్టలో జూనియర్ సివిల్ జడ్జి, మొదటి శ్రేణి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు

- ఈ నెల 27న ప్రారంభం.. హాజరు కానున్న హైకోర్టు న్యాయమూర్తులు

యాదగిరిగుట్ట, జూలై 25 : యాదగిరిగుట్టలో జూనియర్ సివిల్ జడ్జి, మొదటి శ్రేణి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు త్వరలో అందుబాటులోకి రానుంది. పట్టణంలోని కొండకింద తులసీ కాటేజీ ప్రాంతంలో తాత్కాలిక భవనంలో ఏర్పాటు చేసిన కోర్టు భవనాన్ని ఈ నెల 27న ప్రారంభం కానుంది. దీనిని హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ న్యాయమూర్తి వి. వేణుగోపాల్, హైకోర్టు న్యాయమూర్తులు కె. లక్ష్మణ్, కె. సుజన, జిల్లా ప్రిన్సిపల్, సెషన్స్ న్యాయమూర్తి ఎ.జయరాజు హాజరుకానున్నారు. ఆలేరు జూనియర్ సివిల్ జడ్జి మాదిరిగానే ఈ కోర్టు పనిచేయనుంది. యాదగిరిగుట్ట, రాజాపేట మండలాల న్యాయ పరిధిలోని సివిల్, క్రిమినల్ కేసులు ఇక్కడికి రానున్నాయి. ఇప్పటి వరకు యాదగిరిగుట్ట పరిధిలో 1,100, రాజాపేట పరిధిలో 800 సివిల్, క్రిమినల్ కేసులు పెండింగ్ లో ఉండగా ఇక నుంచి ఈ కేసులకు సంబంధించిన విచారణ, వాదోపవాదాలు, తీర్పులు ఇక్కడే కొనసాగనున్నాయి. ప్రస్తుతం తాత్కాలిక న్యాయమూర్తిగా ఆలేరు జూనియర్ సివిల్ జడ్జి నూర సుమలత వ్యవహరించనున్నారు. మరో మూడు, నాలుగు నెలల్లో శాశ్వత న్యాయమూర్తిని నియమించే అవకాశం ఉంది. యాదగిరిగుట్టకు కోర్టు రావడంతో రెండు మండలాలకు న్యాయ వ్యవస్థ చేరువ కావడంతో పాటు సత్వరమే న్యాయం జరిగే అవకాశం ఉందని ప్రజలు భావిస్తున్నారు.

మెడికల్ కాలేజీలో ఎన్ఎంసీ వర్చువల్ తనిఖీలు

- సానుకూలంగా స్పందించిన అధికారులు
- జిల్లా దవాఖాన పైన మరో బిల్డింగ్ నిర్మాణం!
- తొలగిపోనున్న వివిధ రకాల ఇబ్బందులు

యాదాద్రి భువనగిరి, జూలై 25 (నమస్తే తెలంగాణ) : యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి మెడికల్ కళాశాల ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. కాలేజీ అనుమతికి మార్గం సుగమం అవుతున్నది. మెడికల్ కాలేజీ అనుమతి కోసం నేషనల్ మెడికల్ కౌన్సిల్ అధికారులు గురువారం రెండో దశ తనిఖీలు వర్చువల్‌గా నిర్వహించారు. కళాశాలకు సంబంధించి అన్ని సదుపాయాలు, వసతులపై ప్రిన్సిపల్ డాక్టర్ రమేశ్ రెడ్డి, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావు, డాక్టర్ మల్లికార్జున్, డాక్టర్ చిన్నానాయక్ వర్చువల్‌గా వివరించారు. అయితే మొదట జూన్ 24న ఎన్ఎంసీ అధికారులు నేరుగా సందర్శించి వసతులు, సదుపాయాలు, నియామక ప్రక్రియలను పరిశీలించారు. అప్పుడు వివిధ కారణాలతో కళాశాల ఏర్పాటుకు అనుమతి నిరాకరించారు. దీంతో అధికారులు అనుమతి కోసం మరోసారి ఎన్ఎంసీకి అప్పీలుకు వెళ్లారు. దీంతో రెండోసారి వర్చువల్‌గా తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో ఎన్ఎంసీ అధికారులు సానుకూల దృక్పథంతోనే ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ దఫా కళాశాల ఏర్పాటుకు ఎన్ఎంసీ నుంచి అనుమతి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 50 ఎంబీబీఎస్